వీరమణికి స్వర్ణకంకణం బహూకరణ



నాంపల్లి: శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు కళా మందిరంలో పౌరాణిక పద్య నాటకాలు 'రాయబారం '(పూర్తి నాటకం), శ్రీ సత్య హరిశ్చంద్రీయము (శ్మశాన ఘట్టం) ప్రదర్శించారు. ఈ నాటకాలు ఆద్యంతం గత వైభవాన్ని ప్రేక్షకుల కళ్ల ముందు కదలాడేలా చేశాయి. ఈ సందర్భంగా రంగస్థల నటి సాదా వీరమణికి స్వర్ణకంకణ బహూకరణ, కళాకారులను సన్మానించారు. సీనియర్ నటుడు కుందుర్తి వెంకటకృష్ణ, రంగస్థల నటుడు మొవ్వ దేవనాథ సూరి, మహర్షి డాక్టర్ రాజగోపాల్, తడకమళ్ళ రామచందర్ రావు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



యాకుత్‌పురా: హరిబౌలీ గజానన వ్యాయామ శాల మాతేశ్వరీ పోచమ్మ, మహంకాళి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన కుంకుమార్చనలో 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దినేష్, శ్రావణ్, గోపాల్‌యాదవ్, అజయ్, శ్రీధర్, రవీందర్, ప్రభునాథ్, ప్రకాష్, విఠల్ రావు, సాయితేజ, శ్రీనివాస్, అభినవ్, వేద్‌సాయి, అర్చకులు రంగానాథ్ పాల్గొన్నారు.

'తెలంగాణ బోనం' పాటల సీడీ ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ గేయ రచయిత కత్తి చేతన్ రచించిన 'తెలంగాణ బోనం' పాటల సీడీ ఆవిష్కరణ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..బోనాల పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ మాట్లాడుతూ..ప్రతి యేటా భాగ్యనగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బోనాల పండుగపై పాటలను రాయడం ఎంతో అభినందనీయమన్నారు. రచయిత పొన్నం రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో మెహందీ కార్యక్రమం



డబీర్‌పురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా డబీర్‌పురా బోధేఅలీషా కిడికి ప్రాంతంలోని పోచమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని శాకాంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలిత సహస్రనామ పారాయణం అనంతరం రాజరాజేశ్వరి మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మెహందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు భక్తులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు



చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలకు అసౌకర్యాలు తలెత్తకుండా కాంగ్రెస్ సర్కార్ అన్ని చర్యలు తీసుకుంటుందని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ పేర్కొన్నారు. రాజన్నబావి శివాజీనగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ ప్రాంగణంలో బోర్‌వెల్ పనులను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద అవసరమైన మేరకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జంగమ్మెట్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు గాదం శ్రీనివాస్, లింగం, కె.చందర్, ఎ.చెన్నయ్య, రాములు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శాలిబండ, ఖాజీపురా, షక్కర్‌గంజ్, హిమ్మత్‌పురా తదితర ప్రాంతాల్లో రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు వారం రోజులకైనా సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. దీంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది సామాన్య ప్రజలకు అదనపు భారంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భక్తుల పాలిట కొంగుబంగారం..

జగదాంబ అమ్మవారు

నిజాం కాలం నుంచి పూజలందుకుంటున్న అమ్మవారు

- ఇప్పటికే పూర్తయిన బోనాల ఏర్పాట్లు
- పూజల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



జగదాంబ అమ్మవారు

చార్మినార్: సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయం అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో కొలవుదీరిన గణపతి విగ్రహానికి కిరీటంతో పాటు ఇతర ఆభరణాలను 1.5 కిలోల బరువు గల వెండి ఆభరణాలను చేయించి సమర్పించారు. ఈ నెల 20న అమ్మవారికి బోనాల సమర్పించిన అనంతరం మరుసటి రోజు పాతబస్తీ వీధుల్లో అమ్మవారి ఘటాల పరిసమాప్తి సామూహిక ఊరేగింపును వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ తెలిపారు.

శతాబ్దాల క్రితం శీతల్ మాతాగా..

పిల్లాపాపలను ఆయురారోగ్యాలతో చల్లంగా చూసే అమ్మవారు శీతల మాత. సుల్తాన్‌షాహిలో వెలసిన ఈ అమ్మవారిని భక్తులు శీతల్ మాతగా..సిత్లా మాతగా కొలుస్తున్నారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో పూజలు చేస్తే పిల్లలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖః సంతోషాలతో గడుపుతారని భక్తుల విశ్వాసం. నిజాం నవాబు పాలనలో ఆర్థిక లావాదేవీలు చూసే అధికారిగా ఉన్న శాలిబండ దేవిడీ నివాసైన రాజా కిషన్ పరిషాద్ ఈ అమ్మవారి ఆలయాన్ని సుల్తాన్‌షాహిలో పునరుజ్జీవం కల్పించారు. అప్పట్లో శీతల్ మాతాగా పిలిచే వారు.

1976 నుంచి జగదాంబ ఆలయంగా..

1976లో ఆలయ కమిటీ ఏర్పడిన అనంతరం..ఈ ఆలయానికి జగదాంబ ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల జగదాంబ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పిస్తారు. అమ్మవారిని ఒక్కసారి దర్శించుకుంటే ఆయురారోగ్యాలు కలుగుతాయనే భక్తుల నమ్మకం.

ఈసారి ఘనంగా బోనాలు..



ఈసారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశాం. ఈ నెల 20న బోనాల సమర్పణ, 21న అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.

– రాకేశ్ తివారీ,
జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్

ఆలయాలకు ఆర్థిక సహకార చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, రాజేశ్ కుమార్

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ తరఫున బహదూర్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాలలోని ఆలయాలకు ఆర్థిక సహకారం కోసం చెక్కులు పంపిణీ జరిగింది. బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలోని హాల్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, బహదూర్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లాహ్ షరీఫ్, బోయ నగేష్, రవి రాజ్ పాల్గొని వివిధ ఆలయాలకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ..దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పాతబస్తీలోని అన్ని ఆలయాలకు ఆర్థిక సహకారం లభిస్తోందన్నారు.

నేడు అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం వద్ద చెక్కుల పంపిణీ..

ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల కమిటీ ప్రతినిధులకు అందజేసే ఆర్థిక సహాయ చెక్కులను బుధవారం ఉదయం 11 గంటలకు హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయంలో అందజేయనున్నామని ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ హాజరవుతారన్నారు. ఉమ్మడి ఆలయాలకు సంబంధించిన ప్రతినిధులు, కమిటీ సభ్యులు, ఆలయాల కమిటీ సభ్యులు హాజరై చెక్కులు తీసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మంద రవికుమార్

సుల్తాన్‌బజార్: ఈ నెల 10న జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే దస్తగిరి డిమాండ్ చేశారు. హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల మేరకు ఆటో సంక్షేమ బోర్డు, సంవత్సరానికి కాకుండా నెల నెలకు రూ.12 వేలు తదితర హామీలను రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్త ప్రచార యాత్ర ఉంటుందని, అలాగే వచ్చే నెలలో మంచిర్యాలలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ సాదిక్, హిమాంసాబ్, రాజు, నాయక్, జార్జ్, ఆకాష్, రఫీ, సాయి, కార్తీక్, రవికుమార్, అతీష్, అనిల్, ఎండీ వాజీద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కార్వాన్, జియాగూడ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లకు చెందిన వారికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..శస్త్ర చికిత్సలకు అవసరమైన రోగులకు ఇతర వైద్య సహాయానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లీస్ నాయకులు హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలి



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అమలు చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం బడిచౌడిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..సుమారు 2.80 లక్షల మంది విశ్రాంత ఉద్యోగులు ఒక్క శాతం చందాతో కూడిన నగదు రహిత వైద్య సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని పలు దఫాలుగా మంత్రులు ప్రకటనలు సైతం చేశారని తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులు, పెన్షనర్ల పక్షాన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షనర్ల విషయంలో సానుకూలంగా స్పందించి గత నెల 5న రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం వెంటనే నగదు రహిత వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పెంటయ్య, రాష్ట్ర నాయకులు శ్యామ్‌రావు, గంగారెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రహ్లాదరావు తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ రెండెజౌస్ ప్రో ఏఎమ్ లీగ్ హైదరాబాద్ విజేత టీమ్ ఫెయిర్ వేస్



సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ లీడర్లు, అమెచ్యూర్ గోల్ఫర్ల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వివో గోల్ఫ్ రెండెజౌస్ ప్రో ఏఎమ్ లీగ్ హైదరాబాద్ లెగ్ లో టీమ్ ఫెయిర్ వేస్ విజేతగా నిలిచింది. ఆ జట్టులో పలువురు యువ గోల్ఫర్లు అద్భుతమైన ఆటతీరుతో విజయంలో కీలకపాత్ర పోషించారు. కెప్టెన్ శ్రీధర్ అనంతరెడ్డి, అదిత్ అహ్లువాలియా, విశేష్ శర్మ, మహ్మద్ అజార్, సంకీర్త్ నిడదవోలు, రిషబ్ సింగ్, ఆకర్ష్ గౌడ్, వేదాన్ష్ రావుతో కూడిన జట్టు టాప్ గోల్ఫర్లు ఉన్న ప్రత్యర్థి జట్లకు చెక్ పెట్టింది. ఈ సీజన్ ఆద్యంతం పూర్తి ఆధిపత్యం కనబరిచింది. హైదరాబాద్ లెగ్ లో 560 పాయింట్లు సాధించి ఫైనల్ కు అర్హత సాధించింది. థాయ్‌లాండ్ లోని చియాంగ్ మైలో ఫైనల్ జరగనుంది. ఫైనల్స్ లో విజేతకు 50 లక్షల ప్రైజ్ మనీ లభించనుంది.

బోనాల ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనద్ రావు, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషం గౌడ్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, ఆలే భాస్కర్ రాజ్, సిహెచ్.రూప్‌రాజ్‌లు విడుదల చేశారు. ఈసారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని అధ్యక్షుడు కైలాష్ గంగపుత్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్ గిరి, మామిడి కృష్ణ, వై.రామకృష్ణ, బి.వై.శ్రీకాంత్, బొడ్డు సాయిబాబా, వై.రాజు, ఎం.ప్రకాశ్, పి.ప్రకాశ్ రాజ్, దల్లు శివ, జమాల్‌పూర్ అశోక్, జి.రమేష్, చెల్మని నర్సింగ్, ఎం.వినోద్, కె.శ్రీకాంత్, అల్లి మహేందర్ గిరి, మేఘనాథ్, రాము గౌడ్, చందు గౌడ్, ఎం.విక్రమ్ పాల్గొన్నారు.

సత్కారం



చాంద్రాయణగుట్ట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును మంగళవారం బీజేపీ ఎస్టీ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు వి.గోపీనాయక్, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రవి నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావును శాలువాతో సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. అన్సారి రోడ్డు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు. రహమత్‌నగర్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే జహనుమా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు. షేక్ కీ మసీదు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు. అంతరాయం ఉంటుందన్నారు.

రేపు అఖండ శ్రీరామ మహాయజ్ఞం ప్రారంభం

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌లోని మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి మఠ ఆలయంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఏడాది పాటు నిర్వహించే అఖండ శ్రీరామ మహాయజ్ఞానికి సంకల్పించారు. ఆయన ఆధ్వర్యంలో వేద పండితులు నిర్వహించే ఈ మహా కార్యం గురువారం రోజు గురు పౌర్ణమి సందర్భంగా అంకురార్పణ చేయనున్నారు. అఖండ శ్రీరామ మహాయజ్ఞంలో భాగంగా ఏడాది పాటు నిరివ్రామంగా యాగం కొనసాగుతుంది. 21 కోట్ల శ్రీ రామ ఆహుతి వేదపండితులు యాగశాలలో నిర్వహించనున్నారు. యాగం నిత్యం కొనసాగనుండగా శ్రీరామ ఆహ్వాన మంత్రోచ్ఛారణలు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. ఈ యాగంలో భాగంగా ప్రతి రోజు తులసీ అర్చన ఉంటుంది. ప్రతి పౌర్ణమి, అమావాస్యలకు సంవత్సరం పాటు సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

గోషామహల్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలు



మహరాజ్‌గంజ్‌లో అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో అక్రమ కట్టడాల కూల్చివేతలు జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ అబిడ్స్ 14వ సర్కిల్ ఏసీపీగా రమేష్ కుమార్, సెక్షన్ అధికారిగా మహేందర్ ఇటీవలనే పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మహారాజ్‌గంజ్ ప్రాంతంలో జీ ప్లస్-2 అనుమతులు తీసుకొని రెండు అదనపు ఫ్లోర్‌లు అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను సహించేది లేదన్నారు. సెక్షన్ అధికారి మహేందర్, రమేస్ కుమార్‌తో పాటు ఇతర సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

కోడళ్ల మధ్య ఘర్షణ.. కిందపడి అత్త మృతి

చార్మినార్/బహదూర్‌పురా: కుమారుడు రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఇద్దరు భార్యలను ఒకే ఇంట్లో ఉంచాడు. వీరు ఇరువురు రోజూ గొడవ పడేవారు. వీరి ఘర్షణను అడ్డుకోబోయిన అత్తను కోడళ్లు ఇద్దరు తోసేయడంతో కిందపడి గుండె పోటుతో మృతి చెందింది. ఈ ఘటన బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..కిషన్‌బాగ్ అసద్ బాబానగర్‌కు చెందిన మహమూద్‌కు గతంలో వివాహం కాగా..మూడు నెలల క్రితం షహజాది బేగం అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులుగా ఇద్దరు భార్యలు గొడవ పడుతున్నారు. సోమవారం రాత్రి కూడా ఘర్షణ పడుతుండగా అత్త మహమూద్ బీ (65) అడ్డుకోవడానికి మధ్యలోకి వెళ్లింది. దీంతో వారు తోసేయడంతో ఆమె కింద పడిపోయింది. బీపీ ఒక్కసారిగా పెరిగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి..కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.


గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విద్యా శంకర భారతీ, చిత్రంలో కేవీ రమణ, బుద్ధ ప్రసాద్

నాంపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ రచించిన సృష్టిగర్భ (ఉపనిషత్కాంతి) గ్రంథావిష్కరణ-అంకితోత్సవం సభ తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా పుష్పగిరి పీఠాధిపతులు అభినవోద్దండ విద్యా శంకర భారతీ మహాస్వామి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కృతిని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాకవి అందెశ్రీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ దంపతులను సత్కరించారు.

మొహర్రం భక్తి, నమ్మకానికి నిదర్శనం



గీతాలు పాడుతున్న కారీ సయ్యద్ నూర్ పాషా

గోల్కొండ: మొహర్రం భక్తి, నమ్మకానికి నిదర్శనం అని బజ్మే రహమతే ఆలం కమిటీ అధ్యక్షుడు ఎంఏ ముజీబ్ అన్నారు. మంగళవారం రిసాలబజార్‌లో అజ్రత్ ఇమామ్ హుస్సేన్, అతడి కుటుంబ సభ్యుల వీరోచిత పోరాటంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేవలం 32 మందితో అజ్రత్ ఇమామ్ హుస్సేన్ విశాలమైన సంఖ్యలో ఉన్న సైన్యంతో వీరోచితంగా పోరాడారని అన్నారు. ఆనాటి యుద్ధసూత్రాలను పాటించకుండా నాస్తికులైన దుష్టసైన్యం అజ్రత్ ఇమామ్‌తో పాటు ఆయన కుటుంబం మొత్తాన్ని మట్టుపెట్టిందన్నారు. కేవలం అల్లాపై విశ్వాసం, నమ్మకంతో వీరమరణం పొందిన అజ్రత్ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని ముస్లింలు ఏనాటికి మరువరని అన్నారు. సయ్యద్ కారీ నూర్ పాషా అజ్రత్ ఇమామ్ మరణంపై సంతాప గీతాలు పాడి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఖీరత్ కమిటి అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ, కారీ సయ్యద్ సమరుద్దీన్ తదితరులున్నారు.

మహానేతకు ఘన నివాళి



మెట్టు ప్రసాద్ ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న మణిలాల్‌షా తదితరులు

అబిడ్స్: మహానేత, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు మెట్టు ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. పేద ప్రజలకు అన్నదానం నిర్వహించి కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, ఎ.భాస్కర్, విజయలక్ష్మి, రాజేందర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌లు గాంధీభవన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గౌలిపురా గ్రామ దేవతలుగా అమ్మవార్లు



భారతమాత అమ్మవారు



కోట మైసమ్మ అమ్మవారు

గౌలిపురా: గౌలిపురాలోని చారిత్రాత్మకమైన మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలోని అమ్మవార్లు ఆనాటి నుంచి భక్తుల కోరికలు తీర్చుతూ విర జిల్లుతున్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తుంది. గౌలిపురా ప్రాంతంలో ఏనాడో వెలిసిన అమ్మవార్లను గౌలిపురా గ్రామదేవతలుగా భక్తులు పిలుస్తుంటారు. ఈ ఆలయాల్లో నిత్యం పూజలు, దూపదీప నైవేద్యాలు అందుకుంటూ కొలిచే భక్తులు అవసరమైన కోరికలు తీర్చుతుందని పెద్దలు చెబుతున్నారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం..



గౌలిపురాలోని అమ్మవారి ఆలయంలో ఈసారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఉత్సవాలకు ఇప్పటికే ఆలయంలో ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఈ నెల 10న బోనాల ఉత్సవాలు ప్రారంభమై 21న ఘటాల ఊగింపుతో ముగుస్తాయి.

– ఎర్మనీ కైలాష్ గంగపుత్ర,
ఆలయ కమిటీ అధ్యక్షుడు